


వప్పుసురు. జల్లులు జల్లుగా వర్షం ఉదయంనుంచీ కురుస్తూనే ఉంది. కీంకపట్టిన కుర్రాడి ఏడుపు లాగ ఉన్నట్టుండి రివ్వున చల్లని గాలి వీస్తోంది. వీధుల్లో వర్షంనీరు చీలమండలు మునిగిపోయేటంతగా ప్రవహిస్తోంది. సైడు కాలువల్లోని నీళ్ళని తనతో కలుపుకుని మరీనూ-

ఆ వర్షంలోనే, గొడుగు వేసుకున్నా కూడా తడిసి ముద్దగా నీళ్ళోడుతూ యింటి మెల్లైక్కారు మాధవయ్యగారు తడిసిన మొక్క జొన్న పొత్తులా ఉందతని నెరసిన తల. ఇంట్లోకి వస్తూనే గొడుగు ముడిచి

పక్కన పెట్టారు. ఉస్సురని నిట్టూ రుస్తూ భార్యని తువ్వాలందుకో మని కేకేసారు.

కాంతమ్మ భర్త పిలుపుతో ముందు గదిలోకి వచ్చి అతన్నిచూసి నొచ్చుకుంది. "అయ్యో రాత.... ఎంతలా తడిసిపోయేరండీ.... ఉండండి ముందు తువ్వాలతో తల తుడుచుకోండి.... జబ్బు చేయగలదు లేకపోతే—" అంటూ తువ్వా లందించింది.

తల పొడిగా తుడుచుకుని బట్టలు మార్చుకున్నారు మాధవయ్యగారు. కాఫీ తెచ్చి భర్తకి అందిస్తూ కాంతమ్మ అడిగింది- "జగ్గూగాడి భోగట్టా ఏమీ తెలియలేదా!" లేదనే సమాధానం భర్తనుంచి వస్తుందని తెలిసీ, మనసు ఉగ్గబట్టలేక వేసిన ప్రశ్న అది.

"లేదు కాంతం.... నా ప్రయ త్నాలు నేను చేస్తున్నాను మరి."

కాంతమ్మ బాధగా నిట్టూర్చింది.

వాడింక రాడు.

ఇల్లొదిలి పారిపోయేడు. భయంతో, పిరిగ్గా—మందలించా నన్న కోపంతో పారిపోయేడు. ఏ అఘాయిత్యం తల పెట్టడు కదా! ఊరంత పౌరుషం వాడికి. తన మాట నెగ్గాలనే పంతం, పట్టుదల వాడికి హెచ్చు. ఆ ఉక్రోషంతోనే వాడు సమస్యగా తయారయేడు యింటికి.

మాధవయ్య నిట్టూర్చి గదంతా కలయచూసేరు. ఆగదిలో ప్రతి వస్తువు వాడి ఉనికిని గుర్తు తెచ్చేలా వుంది.

గది గోడల నిండా వాడు స్వయంగాఅంటించినవాడి అభిమాన సినిమా హీరో చిత్రాలు, తగిలించిన ఫోటోలూ ఉన్నాయి. రకరకాల భంగిమల్లో సైజుల్లో, రంగుల్లో ఎటుచూసినా అవే. వాడు పుస్తకా లకి అట్టలు కూడా తన అభిమాన హీరో బొమ్మలే వేస్తాడు. చిత్రం ఏమిటంటే వాడిదగ్గరున్న నోట్స్ పుస్తకాల అట్టలమీద కూడా అవే బొమ్మలుండటం!

మంచిగా చెపితే వినే స్థితిని వాడెప్పుడో దాటేశాడు. తన ఆదాయం అంతంత మాత్రం.

అందులోనే వాడు చేస్తున్న అనవసరపు ఖర్చులు.

తన అభిమాన హీరో సినిమా రిలీజైన మొట్టమొదటి రోజు మొదటి షో చూడాల్సిందే. చదువులేదు, కాలేజీ లేదు. ఇంటి పరిస్థితి గురించి పట్టింపు అసలే లేదు. వాడు కొనే సినిమాపత్రిక లకి కొదవలేదు.

అభిమాన హీరో పిక్చర్

లీజైననాడు వెండితెరమీద వల్ల డానికి పువ్వులు చందాలు వేసుకొని కొంటారుట.

తమ హీరో విజయాలు, నటనా వైదుష్యం, వీటన్నిటినీ స్తోత్రం చేస్తూ అచ్చువేసే కర పత్రాలకోసం చందాలు. ఎంత డబ్బవుతుందో?

కొంత డబ్బు పైనుంచి ముడుతూ వుంటుందని కూడా అంటారు. దాని సంగతెలావున్నా, విళ్ళు తమ అభిమానాన్ని ఉధృతంగా ప్రకటించుకోవడం కోసం, ఆ డబ్బులుచాలకో ఏమో చందాలు వేసుకొని మరీ అలాంటి కార్యక్రమాలు చేపడుతూ వుంటారు.

ఒక రకంగా జగ్గూ ఇలా కావడంలో తన బాధ్యత లేదూ!

ఉంది—ఉంది.

వాడ్ని చిన్నప్పటినుంచీ అడ్డమైన సినిమాలకి తీసుకెళ్ళి వాడికి సినిమాలపిచ్చి ముదిరేలా చేసింది తనే.

పదిమంది రౌడీలను ఒక్క చేతితో ఎదుర్కొనే హీరోను చూస్తూ ఆనందంతో వుత్సాహం పట్టలేక వాడు కేరింతాలు కొడుతూ వుంటే ముచ్చట పడింది తను.

తనే—

నిజానికి తనొక్కడే బాధ్యుడు కాదేమో!

లాభాలమీద దృష్టితో సకుటుంబంగా చూడతగిన సినిమాల పేరిట, పరమ జుగుప్సాకరమైన సన్నివేశాలతో సినిమాలు తీసే వాళ్ళూ, అర్థంలేని సెన్సార్ విధానంతో, స్వీయ దౌర్బల్యాలతో చిత్రసీమ పరిస్థితిని మరింతగా దిగజార్చి వేస్తున్న సెన్సార్ బోర్డూ.

దోపిడీ విధానాన్ని అన్ని రంగాలలోను తీవ్రంగా వ్యతిరేకించే తిరుగుబాటు యువతరం, వెండి తెరమీద తిరుగుబాటుసన్నివేశాలతో వుద్రేకపడి, సంతృప్తిపడిపోతూ సమాజనాడుల్ని బలహీనపరుస్తూ కుళ్ళిపోతూండేలా చేస్తున్న ఈ రకం సినిమాలపట్ల మాత్రం ఉదాసీన వైఖరి చూపిస్తూ పరోక్షంగా దాన్ని ప్రోత్సహించడం.

అన్నీ కారణాలే!

అందరూ కారకులే!

మానవబలహీనతల మీద డబ్బు చేసుకొనే మన స్తత్వం మారనంత కాలం ఇదిలా సాగాల్సిందే.

మాధవయ్య తల ఆలోచనలతో వేడెక్కిపోయింది.

ఇంత విస్తారంగా ఆలోచించే

తను కూడా చివరకి జగ్గూ విషయంలో ఏం చేయగలిగాడు? తండ్రిగా వాణ్ణి అదుపులో ఏం పెట్టగలిగాడు?

ఏ మమకారపు ప్రేగు సకాలంలో వాడి నడవడికలోని లోపాన్ని గుర్తించలేకపోయింది?

ఎంత గుడ్డివాడయిపోయాడు తను—

తీరా వాడు తననుంచిదూరంగా-దూరంగా జరిగిపోయి—పారిపోయేక వాడి గురించి బాధపడీ ఏం లాభం?

జగ్గూ ఇల్లువదలి పోవడానికి ఇంట్లో మొన్న జరిగిన రభసే కారణం.

పరీక్ష ఫీజుకని తీసికెళ్ళిన డెబ్భైఐదు రూపాయలూ సిటీ బస్‌లో ఎవరో తీసేసారని చెప్పాడు.

ఆ మధ్య చేతివేలికి వున్న ఒక్క ఉంగరమూ ఎక్కడో జారిపోయిందని చెప్పాడు.

అదీ నమ్మేడు. ఇదీ నమ్మేడు.

మొన్న రాముా వచ్చి చెప్పే వరకూ వాడి మాటలన్నీ నిజమే అని నమ్మాడు తను.

కాని, ఆ ఉంగరం తాకట్టు పెట్టాడనీ, డబ్బంతా తీసుకెళ్ళి అభిమాన హీరో పేరు మీద తాము స్థాపించిన అభిమాన సంఘం కోసం ఖర్చు చేసాడనీ- రాముా వల్ల కానీ తెలియలేదు.

రాముా చెప్పిన విషయం విన్నాక విభ్రాంత పోయాడు తను.

అది అభిమానసంఘమా! దురభిమానసంఘమా అనిపించింది.

అభిమానం వెర్రి తలలు వేసి దురభిమానంగా మారుతూ మేధస్సు మొద్దుబారి పోయే స్థితి ఎందుకు ఏర్పడుతోంది?

రాముా చెప్పాడు.

ఉంగరం తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బు, పరీక్ష ఫీజుకోసం యిచ్చిన డబ్బు- అంతా జగ్గూ అభిమాన సంఘం కోసం ఖర్చు చేశాడని—

తమ హీరో వేసిన సినిమా రిలీజయి ఆరు వారాలుగా ఆడుతోంది. వెన్నెముక లేని యువతరం- తమ చీకటి బతుకుల్లో ఎక్సైట్‌మెంటు వెతుక్కునే కక్కుర్తితో ఆడవాళ్ళు-కాలక్షేపం కోసం వృద్ధులూ- మొత్తానికందరూ బాగానే పోషిస్తున్నారు ఆ సినిమాని.

ఆరు వారాలుగా హౌస్ ఫుల్ అవుతూనే ఉంది.

కాని ఇక మీదట హౌస్ ఫుల్ అయే అవకాశాలు కనిపించడం లేదు. జనం పల్చబడి పోతున్నారు.

జగ్గూ వాళ్ళకి అది తల కొట్టేసి నట్లయింది. ప్రత్యర్థుల అభిమాన హీరో సినిమా ఏడువారాలు హౌస్ ఫుల్ అయింది, మొన్ననే.

ఇప్పుడీ సినిమా ఆరు వారాల తోటే హౌస్‌ఫుల్ అవడం మానేస్తే తమ కెంత నామర్దా? ఎంత అప్రతిష్ఠ? వాళ్ళ దగ్గర ఎంత అవ హేళనకు గురవాలి?

తమ అభిమాన హీరోగారి సినిమా ఆడుతున్న థియేటరు ముందు హౌస్ ఫుల్- హాలు నిండింది- అనే బోర్డు వేలాడుతూ కనిపిస్తే ఎంత గర్వంగా, గొప్పగా ఉంటుందని- ప్రత్యర్థి అభిమాన సంఘం వాళ్ళు ఎంతో గొప్పగా వేసుకున్నారు. తమ హీరోగారి సినిమా ఏడు వారాలు హౌస్ ఫుల్‌తో నడిచిందని కలెక్షన్ కూడా ఎంతయిందో వేసారు పోష్టరు మీద.

ఆ రికార్డు యిప్పుడు బద్దలు కొట్టాలంతే. ఏమయినా మరో వారం రోజుల పాటు హాలు ముందుహౌస్‌ఫుల్ బోర్డు వేలాడి తీరాల్సిందే. మరందు చేత మరో దారి లేక చందాలు పోగుచేసుకుని మిగిలిపోయిన టిక్కెట్లు కొనే స్తున్నారుట- జగ్గూ వాళ్ళు.

అందుకోసం విధులు సమ కూర్చుకునే ప్రయత్నంలోనే ఒక భాగం-వాచీలు, ఉంగరాలు, సైకిళ్ళు తాకట్టు పెట్టడం.

ఎంత దారుణం?

దీని వల్ల బాగుపడుతున్న దెవరు?

దీనివల్ల వీళ్ళకి ఒరిగే దేముంది?

కన్న వారి కళ్ళలో రక్తపు చుక్కలు రాలడం తప్ప?

రామూవల్ల విషయం తెలిసి జగ్గూని బాగా దులిపేసారు మాధవయ్యగారు. రోషంతో ఏదో అనబోయాడు. ఆ కోపంలో నిగ్ర హించుకోలేక చెంప ఛెళ్ళుమని పించి యింట్లోంచి మెడ బట్టుకుని బయటకు తోసేసాడు.

అంతే__

అలా వీధిన పడిన జగ్గూ మరి రాలేదు.

కాంతం ఏడుపు ప్రారంభిం చింది.

వస్తాడులే అనుకొని ఊరు కున్నాడు. కానీ వచ్చే సూచనలు లేక పోవడంతో తనకీ దిగులు మొదలయింది. తెలిసిన వాళ్ళంద రినీ అడుగుతూ వెతకడం మొదలు పెట్టాడు.

ఉంగరం, డబ్బు పోతే పోయేయి__

వాడు కనిపిస్తే బాగుణ్ణు—

జగ్గూ కనిపించలేదు.

* * *

వర్షం కొంచెం తెరిపిచ్చింది.

సాయంత్రం మొదటి ఆట వేసే వేళయింది. జగ్గూ సినిమా థియేటర్ దగ్గర కనిపిస్తాడేమో ననే ఆశ పీకుతోంది మాధవయ్యగారికి. మొన్నా విన్నా వాడసలు ఆ ఛాయలకి రాలేదు. ఇవాళ వస్తాడేమో.

మరోకప్పు కాఫీ తాగి బయలుదేరారు మాధవయ్యగారు.

అతను హాలుదగ్గరకి చేరేసరికి అక్కడంతా గొడవగా, దొమ్మీగా ఉంది.

కొద్దిసేపటి క్రిందటే అక్కడో గొప్ప సంగ్రామం జరిగినట్టుగా ఉంది. అంతా బిగ్గరగా అరుచుకుంటూ, మాట్లాడుకుంటూ అటూ యిటూ తిరుగుతున్నారు.

మాధవయ్యగారికి అసలేం జరిగిందో అర్థం కాలేదు. వారగా ఓ చోట నిలబడిపోయి చూస్తున్నారు.

అతని కళ్ళకి అల్లంత దూరంలో రాముా కనిపించేడు. పిలుద్దామనుకుంటున్నంతలో అతనే హడావిడిగా వచ్చేడు మాధవయ్య దగ్గరకి.

వస్తూనే రొప్పుతూ చెప్పేడు- "మీ జగ్గూని కొట్టేసారండీ - ఇప్పుడే యిక్కడ పెద్ద దెబ్బలాట అయింది. అభిమాన సంఘాల వాళ్ళ మధ్య తగవు వచ్చి పెరిగి పెద్దదయి గొడవ జరిగింది. ఈ హీరో సినిమా ఇవాళ హౌస్‌ఫుల్ కావడంకోసం మిగిలిపోయిన టిక్కెట్లు చందాలు వేసుకుని స్వయంగా కొనుక్కునే గతి పట్టిందని ఎవరో హేళనచేస్తూ కామెంట్ చేసారుట, దాంతో మొదలయింది. మాటా మాటా పెరిగి బెల్టులూ, చెయిన్లూ తీసి కొట్టుకున్నారు. మీ జగ్గూకూడా అందులో ఉన్నాడండీ. జగ్గూకి పెద్ద దెబ్బతగిలింది తల మీద. హాస్పిటల్‌కి తీసికెళ్ళారు. ఆ విషయం చెప్పడానికే మీ యింటికి పరిగెత్తుకొస్తున్నా—"

మాధవయ్యగారి కాళ్ళ క్రింద నేల కంపించి నట్లయింది. నరాలు తోడేసి నట్లయింది. గుండెనెవరో కుదిపి కుదిపి వదలిపెట్టి నట్లయింది.

నీళ్ళు నిండిన కళ్ళతో అయోమయంగా చుట్టూ చూసేరు.

ఆయన కళ్ళకు—

హాలు బయట అప్పుడే వ్రేలాడదీసిన హౌస్‌ఫుల్ బోర్డుమీద అక్షరాలు విచ్చుకత్తుల్లా గుచ్చుకున్నాయి.

అవును.

హాలు నిండింది; మామూలుగానే. ●